

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీలోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. శనివారం పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 90.09 శాతం మేర హాజరు నమోదైంది. - 8లో

గరిష్టం/కనిష్టం 43.4/26.8

వాతావరణం

జిల్లాలో శనివారం 26.8 - 43.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

ఆమోద యోగ్యంగా.. ఆచరణ సాధ్యంగా..

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో 2024



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సంక్షేమ పాలనను యథావిధిగా కొనసాగిస్తామని అన్ని వర్గాల ప్రజలకు మరోసారి భరోసా ఇచ్చారు. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన మేనిఫెస్టో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రజలకు మరింత నమ్మకాన్ని పెంచింది. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా అన్ని వర్గాలకు సముచితమైన సుపరిపాలనను అందించే సత్తా కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని వివిధ వర్గాల ప్రజలు, కార్మికులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, రైతులు తదితరులు తమ మనోగతాన్ని వెల్లడిస్తున్నారు. ఈ మేనిఫెస్టో అన్ని వర్గాల వారిని సంతృప్తి పరిచేలా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికీ వివరించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. మేనిఫెస్టో హంగు, ఆర్భాటం లేకుండా, వాస్తవికతకు దగ్గరగా, ఆచరణ సాధ్యంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడానికి ఈ మేనిఫెస్టో బాటలు వేస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేనిఫెస్టోపై పలువురు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్

● అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా వైఎస్సార్‌సీపీ ప్రణాళిక ● వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను స్వాగతిస్తున్న సకల వర్గాలు ● ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు

అమ్మ ఒడి పెంపు హర్షణీయం



ప్రస్తుతం అమ్మ ఒడి పథకం కింద ఇస్తున్న రూ. 15 వేల మొత్తాన్ని రూ. 17 వేలకు పెంచడం హర్షణీయం. అలాగే డ్వాక్రా సంఘాలకు రూ. 3 లక్షల వరకు సున్నా వడ్డీ ఇస్తుండడం అభినందనీయం. వైఎస్సార్ చేయూత రూ. 75 వేల నుంచి రూ. 1.50 లక్షలకు పెంచడం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం. మనసున్న ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.
– శాంతమ్మ, బుడగజంగం కాలనీ, కడప

చేనేతలను ఆదుకున్న ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతల పక్షపాతి. ప్రస్తుతం ఇస్తున్న నేతన్న నేస్తాన్ని రూ. 1.20 లక్షల నుంచి రూ. 2.40 లక్షకు పెంచడం సంతోషదాయకం. చేనేతల కష్టాలను గుర్తించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇప్పటికే చేనేతలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం చేనేతలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. – మామిళ్ల వెంకట సుబ్బమ్మ, చేనేత కార్మికురాలు, మాధవరం

చంద్రబాబు కేజీ బంగారు ఇస్తానన్నా నమ్మరు



చంద్రబాబు కేజీ బంగారు ఇస్తానన్నా ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదనే విషయం ప్రజలందరికి తెలుసు. ఇప్పుడు ఆయన ఏమి చెప్పినా విశ్వసించరు. చెప్పిన హామీలను వైఎస్ జగన్ మాత్రమే అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఏర్పడింది. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మేనిఫెస్టోలో ఇచ్చి హామీలన్నింటిని అమలు చేయడమే ఇందుకు కారణం.
– ఎస్.ఖాజాపీర్, ప్రొద్దుటూరు

వంద శాతం అమలు చేస్తాడు



జగన్‌మోహన్‌రెడ్డి మీద ప్రజలకు అపారమైన నమ్మకం. ఆయన చెప్పాడంటే చేస్తాడంతే. మేనిఫెస్టోను ఒక బైబిల్‌గా, ఖురాన్‌గా, భగవద్గీతగా భావిస్తాడు. ఇప్పుడు ఇప్పుడు ఇచ్చిన హామీలను కూడా వంద శాతం అమలు చేస్తాడు. గత ఎన్నికల ముందు కూడా ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వనివి కూడా అమలు చేశాడు. -కంకర మౌలాలిరెడ్డి, చిన్న వెంతుర్ల, మైలవరం మండలం

ప్రజలకు జగన్‌పై నమ్మకం



వైఎస్ జగన్ ఏదైతో చెబుతాడో అది ఎంత కష్టతరమైనా సరే చేసి తీరుతాడనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. గతంలో చంద్రబాబు రుణమాఫీ అని చెప్పి అధికారంలోకి రాగానే మాట మార్చాడు. అక్కచెల్లెమ్మలకు బంగారు ఇంటికి తెచ్చిస్తా అని చెప్పి మోసం చేశాడు. జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాడు. ఈ మేనిఫెస్టో వల్ల ప్రజలు మరింత ఆర్థిక పరిపుష్టి పొందే అవకాశం ఉంది.
-కొవ్వూరు మునిరత్నంరెడ్డి, చక్రాయపేట

ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం



ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసా కింద ఒక రైతుకు రూ 13,500 అందజేసేది. ఇకపై రూ.16 వేలు రానుండటం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చాడంటే అమలు చేస్తారు. ఇది ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం. రైతు భరోసా పెంపు మా లాంటి రైతులందరికీ సంతోషదాయకం. - కాటిగాండ్ల చిన్న సుబ్బరాయుడు, తుమ్మలూరు గ్రామం, పెండ్లిమర్రి మండలం

రైతు భరోసా పెంపు హర్షణీయం



రైతులకు ప్రస్తుతం రైతు భరోసా కింద రూ.13500 వస్తోంది. అది రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు ఉపయోగపడేది. ప్రస్తుతం 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కింద రైతులకు రూ.16వేలు పెంచుతూ మేనిఫెస్టో విడుదల చేశారు. ఇది రైతులకు చాలా ఉపయోగపడుతుంది. అదేవిధంగా వివిధ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు, విద్యార్థులకు మేలు కలిగే విధంగా మేనిఫెస్టోలో పొందుపర్చడం హర్షించదగ్గ విషయం.
- కె వరమోహన్‌రెడ్డి, లింగాల

అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో నిజమైనది. అన్ని వర్గాలకు తిరిగి మరోసారి మేలు చేకూర్చేలా ఉండటం అభినందనీయం. ముఖ్యంగా ఈ రాష్ట్రంలో కాపు నేస్తం రూ.60వేల నుంచి 1.20 లక్షలకు పెంచనుండటం హర్షణీయం. నవరత్నాలను మరింత మెరుగ్గా అమలుచేసే విధంగా మేనిఫెస్టో రూపకల్పన అద్భుతంగా ఉంది. ప్రస్తుతం మేనిఫెస్టోలో ఉన్న నవరత్నాలను 99శాతం అమలు చేసిన సీఎం జగన్‌లా దేశంలో ఎవరూ లేరు. ఇది ఒక రికార్డు. -మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, రాజంపేట

బాబు మేనిఫెస్టో బోగస్



చంద్రబాబు మేనిఫెస్టో అంతా బోగస్. అది మేనిఫెస్టో కాదు. ఎన్నికల్లో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు నోటికి వచ్చింది చెబుతుంటాడు. గత ఎన్నికల్లో కూడా బాబు మేనిఫెస్టో అమలు చేయలేదని ప్రజలందరికి తెలుసు. అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను మరిచిపోవడం బాబునైజం. అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన వాటన్నింటిని పూర్తి స్థాయిలో అమలుచేశారు. మళ్లీ అదేరీతిలో పేదవర్గాలకు మేలు జరిగేలా మేనిఫెస్టోను తీసుకొచ్చారు. - ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి, రాజంపేట

జగనన్న చెప్పిందే చేస్తాడు.. చేసేదే చెబుతాడు



జగనన్న మాట తప్పడు.. మడమ తిప్పడు.. అలాగే చెప్పిందే చేస్తాడు.. చేసేదే చెబుతాడు... రైతులకు గత మేనిఫెస్టోలో రూ.12,500 చొప్పున నాలుగేళ్లు ఇస్తానని చెప్పిన జగనన్న రైతులకు అన్ని విధాలా ఉపయోగపడాలన్న ఆశయంతో రూ.1000 పెంచి ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లు ఇచ్చారు. అలాగే ఈ మేనిఫెస్టోలో రైతు భరోసా ద్వారా రైతులకు రూ.16వేలు ఇస్తామని జగనన్న ప్రకటించారు. జగనన్న చెబితే కచ్చితంగా ఇస్తారని రైతుల నమ్మకం.
–నంబటూరు ప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ ఉద్యాన సలహాదారు, కమలాపురం

సంక్షోభంలోనూ ఆగని సంక్షేమం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కరోనా వంటి సంక్షోభంలో కూడా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశారు. ఇప్పుడు నూతనంగా ప్రకటించిన మేనిఫెస్టోతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేకూరుతుంది. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో అమలు చేయాలంటే మూడు రాష్ట్రాల బడ్జెట్ కూడా సరిపోదు. గతంలో కూడా చంద్రబాబు 2014లో కూడా అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని అమలుపరచలేదు. -చిన్నప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్, పులివెందుల

వందశాతం అమలు



నవరత్నాలతో పేదల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. చెప్పిన వాటిని వందశాతం అమలు చేసే వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే. 2019 ఎన్నికలలో మేనిఫెస్టోలో చెప్పనవి 99శాతం అమలు చేయడంతోపాటు సమయానుకూలంగా ప్రజలకు అవసరమైన మరెన్నో పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను చేశారు. -జి శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

న్యూస్‌రీల్

ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలించిన ఎన్నికల అధికారి



రికార్డులను పరిశీస్తున్న ఎన్నికల అధికారి

జమ్మలమడుగు: కడప పార్లమెంట్ పరిధిలో జమ, ఖర్చు పద్దు ఎన్నికల పరిశీలనాధికారి రాజేష్ భారతి ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్, కార్యాలయ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కడప నగరంలో ఏపీసెట్ - 2024



ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీసెట్)-2024 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు, ఏపీసెట్ ప్రాంతీయ సమన్వయకర్త ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్ వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హతను నిర్ణయించే ఏపీసెట్ ను ఈనెల 28వ తేదీ ఆదివారం కడప నగరంలోని 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు 2,500 అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం, గవర్నమెంటు డిగ్రీ కాలేజీ ఫర్ మెన్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజీ ఫర్ ఉమన్, ఎస్వీ కాలేజీ ఫర్ ఇంజినీరింగ్, నాగార్జున డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఫర్ ఉమన్, శ్రీ వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఫర్ ఉమన్, శ్రీహరి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, విద్యాసాధన డిగ్రీ కాలేజీలను కేంద్రాలుగా నిర్ణయించామన్నారు. పరీక్ష పర్యవేక్షణకు ప్రతి కేంద్రానికి విశ్వవిద్యాలయం నుంచి అబ్జర్వర్లను నియమించామన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభ సమయానికంటే గంట ముందే కేంద్రాలకు హాజరుకావాలన్నారు. నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేదిలేదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం/ఖాజీపేట/మైదుకూరు: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. మండలంలోని చెన్నమరాజుపల్లెను శనివారం ఎస్పీ సందర్శించారు. స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ గ్రామంలోని వీధుల్లో తిరిగారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ అన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మురళీధర్, రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్ పాల్గొన్నారు.

● పక్కా ప్రణాళికతో ఎన్నికల బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. ప్రొద్దుటూరులోని ఐఎంఏ హాల్‌లో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని పోలీసు అధికారులతో శనివారం ఎస్పీ సమావేశం నిర్వహించారు, ఎస్పీ మాట్లాడుతూ గతంలో ఎన్నికల సందర్భంగా నేరాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘ ఉంచాలని చెప్పారు.

● ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామంలో ఎస్పీ పర్యటించారు. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలోని ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ రామాంజలు పాల్గొన్నారు.

● ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 30న మైదుకూరులో పాల్గొనే బహిరంగ సభ వేదిక స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు.

శిక్షణా తరగతులకు గైర్హాజరైతే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్: సాధారణ ఎన్నికలు 2024కు సంబంధించి నియమించిన పోలింగ్ సిబ్బంది ఎవరైనా శిక్షణా తరగతులకు గైర్హాజరైతే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జనరల్ అబ్జర్వర్ కునాల్‌సిల్‌కు పేర్కొన్నారు. శనివారం కడపలో పోలింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ జరిగింది. దీంతో సిబ్బందికి సంబంధించి టీం కేటాయింపులు నియోజకవర్గాల వారీగా పూర్తయిందని వారు తెలిపారు. జిల్లాలోని 2035 పోలింగ్ కేంద్రాలకు గాను ఒక్కో పోలింగ్ కేంద్రానికి 6 మంది సిబ్బంది చొప్పున 15 శాతం రిజర్వుతో టీంలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను జారీ చేశామన్నారు. పీఓ, ఏపీఓగా నియమితులైన వారికి రెండవ విడత శిక్షణా తరగతులు మే 2, 3వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి కేటాయించిన ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో జరుగుతాయని తెలిపారు. జిల్లాలో సమస్యాత్మకంగా గుర్తించిన 527 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. వీరికి మే 1వ తేదీ ఉదయం 9 గంటలకు కడప జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా తరగతులకు గైర్హాజరైన సిబ్బందిపై ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, డీఆర్ఓ గంగాధర్‌గౌడ్, సీపీఓ డీఐఓ, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

మే 4వ తేదీలోపు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలలో ఫెయిల్ అయిన అభ్యర్థులు మే 4వ తేదీలోపు ఫరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 25 రూపాయల అపరాధ రుసుంతో మే 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు, 50 రూపాయల అపరాధ రుసుంతో 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే తత్కాల్ పద్ధతిలో పదో తరగతికి రూ. 500, ఇంటర్మీడియట్‌కు రూ. 1000తో ఫీజు మే 9వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10వ తేదీ నుంచి 12 తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

తెరపైకి తెలుగు కాంగ్రెస్!

● వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ తీరు
● ముస్లిం మైనార్టీలను టార్గెట్ చేస్తున్న వైనం
● తెలుగుదేశం పార్టీకి లబ్ధి చేకూర్చడమే లక్ష్యం
● కడప, ప్రొద్దుటూరు, రాయచోటిలో టీడీపీకి పరోక్ష సహకారం



సాక్షి ప్రతినిధి, కడప: సార్వత్రిక ఎన్నికల పర్వంలో రాజకీయ పక్షాల అపవిత్ర కలయికలు తెరపైకి వస్తున్నాయి. తాము గెలవడం కంటే తమ ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టడమే లక్ష్యంగా రాజకీయ పార్టీల మధ్య అవగాహన కుదురుతోంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య కొనసాగుతున్న మైత్రి ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. తాము ఎటూ గెలవలేం, వైఎస్సార్‌సీపీని నియంత్రించడమే లక్ష్యం కావాలనే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోంది. అందివచ్చిన అవకాశాన్ని తెలుగుదేశం పార్టీ సద్వినియోగం చేసుకుంటోంది. వెరసి తెలుగు కాంగ్రెస్ రాజకీయాలు జోరుగా నడుస్తున్నాయి.

ప్రజల ముంగిట్లోకి పాలన తీసుకువచ్చాం. క్షేత్రస్థాయిలో ఎంతో అభివృద్ధి చేశాం .. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాం. మరోమారు అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటర్లను అభ్యర్థిస్తోంది. తమ పాలనలో లబ్ధి చేకూరి ఉంటేనే ఆశీర్వదించండని ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కోరుతున్నారు. చరిత్రలో తన వల్ల మేలు చేకూరి ఉంటే ఓట్లు వేయండనే రాజకీయ నేత ఇంతవరకూ ఎవరూ లేరని ప్రజలు కొనియాడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే కుట్రలు, కుయుక్తులతో లబ్ధి పొందాలనే వైఖరిని తెలుగుదేశం పార్టీ అవలంబిస్తోంది. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీకి గణనీయంగా పట్టు ఉన్న ఓటర్లలో చీలికలు తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధానంగా మైనార్టీ ఓట్లు చీల్చడమే ధ్యేయంగా పావులు కదుపుతున్నారు.

వ్యూహాత్మకంగానే అఫ్జల్‌ఖాన్ అభ్యర్థిత్వం

జిల్లాలో వైఎస్ కుటుంబం అన్నా, వైఎస్సార్‌సీపీ అన్నా పార్టీలకు అతీతంగా ముస్లిం మైనార్టీలు అండగా నిలుస్తూ వస్తున్నారు. గతంలో అనేక ఎన్నికల్లో ఆ విషయం తేటతెల్లమైంది. ఇప్పటికే కడపలో రెండు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎస్‌బి అంజద్‌బాషా విజయకేతనం ఎగురవేశారు. ప్రస్తుతం మరోమారు తలపడుతున్నారు. ఈమారు వైఎస్సార్‌సీపీని ఎన్నికల్లో ఎలాగైనా నియంత్రించాలనే లక్ష్యంతో టీడీపీ కుయుక్తులు పన్నుతోంది. ఓవైపు విద్వేషాలు రెచ్చగొడుతూ కుట్ర రాజకీయాలు చేస్తుండగా, మరోవైపు కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఆమేరకే కడపలో అఫ్జల్‌ఖాన్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో దించారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అఫ్జల్‌ఖాన్ అభ్యర్థిత్వం ఎంచుకోవడం వెనుక కూడా కారణం లేకపోలేదు. ముస్లిం మైనార్టీలలో పఠాన్ తెగకు చెందిన వారిని తమ వైపు మరల్చుకోవాలనే భావనలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఆమేరకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఆర్థిక సహకారం అందించేందుకు రహస్య ఒప్పందం కుదిరినట్లు సమాచారం. కడప శివార్లలోని జయరాజ్ గార్డెన్‌లో తెలుగు కాంగ్రెస్ నేతలు సమావేశమై అఫ్జల్‌ఖాన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

▶▶ కడప, ప్రొద్దుటూరు, రాయచోటిలలో ఎందుకంటే...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ముస్లిం కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరింది. తద్వారా వైఎస్ కుటుంబానికి అండగా ఉంటున్నారు. కడపలో ముస్లిం మైనార్టీ ఓటర్లు దాదాపు 90వేలు ఉన్నారు. వీరి మద్దతు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి కొనసాగుతోంది. మరోవైపు బీజేపీ, జనసేనతో పొత్తు కారణంగా కూడా టీడీపీకి వ్యతిరేకంగా నిలవనున్నట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారి ఓట్లలో చీలిక తీసుకువస్తే ఫలితం తమకు అనుకూలంగా ఉంటుందనే దిశగా టీడీపీ నాయకులు అడుగులు వేశారు. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపి కడపలో అఫ్జల్‌ఖాన్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక చేయించారు. ప్రొద్దుటూరు, రాయచోటి నియోజకవర్గాల్లో కూడా ఇదే పంథాను కొనసాగించారు. ప్రొద్దుటూరులో దాదాపు 45వేలు ముస్లిం ఓటర్లు ఉన్నారు. వీరిలో భారీగా చీలికలు తీసుకురావాలనే ఉద్దేశంతో మహమ్మద్ నజీర్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అలాగే రాయచోటిలో కూడా అల్లాబక్ష్ ఎంపిక వెనుక కూడా టీడీపీకి లబ్ధి చేకూర్చడమే అసలు లక్ష్యమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. జిల్లాలో ఇలా అవసరమైన మేరకు సహకరించేందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డితో నిత్యం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు కూడా పలువురు చెప్పుకొస్తున్నారు. మొత్తానికి జిల్లాలో తెలుగు కాంగ్రెస్ రాజకీయాలు తెర ముందుకు రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

బాలుడి డ్రైవింగ్
– అదుపు తప్పిన టిప్పర్



పడిపోయిన విద్యుత్ స్తంభాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని వంకబడి మిట్టమల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో పార్కింగ్ చేసి ఉన్న టిప్పర్‌ను డ్రైవింగ్ చేసిన బాలుడు (14) బీభత్సం సృష్టించాడు. తాళాలు అలాగే ఉంచడంతో ఆ ప్రాంతంలోని బాలుడు టిప్పర్‌లోకి వెళ్లి స్టార్ట్ చేసి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంబభాలు, రేకుల షెడ్డులను ఢీకొట్టాడు. అయితే ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అంటున్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అరటితోట దగ్ధం



కాలిపోయిన అరటితోట

పులివెందుల రూరల్ : కోతదశలో ఉన్న అరటితోట అగ్నికి ఆహుతి కావడంతో అన్నదాత తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి సుగాలి తాండాకు చెందిన రామానాయక్ మూడెకరాల్లో అరటి సాగు చేశాడు. తోటలో డ్రిప్ పరకరాలు ఏర్పాటు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అరటితోటకు నిప్పు పెట్టారు. దీంతో అరటిచెట్లు, డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. 3లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. అరటితోటలో మంటలు వస్తుండటంతో స్థానికులు గుర్తించి ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు

కొండాపురం : దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగీంద్ర శనివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కొండాపురం గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి ఓబన్నపేట గ్రామానికి చెందిన గంగరాజు మధ్య పాత గొడవలు ఉన్నాయి.పాత కక్ష మనస్సులో పెట్టుకొని గంగరాజుపై లక్ష్మీకాంత్‌రెడ్డి కట్టెతో తలపై కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి.వివిధ నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారు. తాజాగా శనివారం పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సాయినాథ శర్మ

కమలాపురంలో 50 కుటుంబాలు

కమలాపురం : కమలాపురం 11వ వార్డులోని పోలీస్ లైన్ వీధికి చెందిన 50 కుటుంబాలు నియోజకవర్గ నాయకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. శనివారం సాయినాథ శర్మ అనుచరులైన సుబ్బరాయుడు, భాస్కర్, ఉదయ్ తదితరులకు చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డికి ఎలాంటి అనుభవం లేని సమయంలోనే 151 సీట్లు వచ్చాయన్నారు. ఈ ఐదేళ్ల పాలన చూసిన ప్రజలు జగనన్నకే పట్టం కడతారని, 175 సీట్లు తప్పక సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాట తప్పని, మడమ తిప్పని వ్యక్తి జగనన్న అని, ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సాయినాథ శర్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే శాంతి, అభివృద్ధిని కోరుకునే వ్యక్తి అని, ఇలాంటి ఎమ్మెల్యేను మనం తిరిగి గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, దస్తగిరి, హిదాయత్, సాదిక్, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, గఫార్, జిలానీ బాషా, దేవదానం, మస్తానయ్య, శరత్‌బాబు, జెట్టి నగేష్, రాజారెడ్డి, క్రిష్టారెడ్డి, షావలి తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం మండలంలో..

సింహాద్రిపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని బిదినంచెర్ల గ్రామానికి చెందిన 11 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వివిధ పార్టీలకు చెందిన యువకులు చెన్నకేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, విక్రంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, చాకలి శ్రీరాములు, షేక్ సుబహాన్, చెన్నకేశవ రెడ్డి, రఘునాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు ఎన్నికల పరిశీలకుడు గండ్లూరి వీరశివారెడ్డి, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కేశవరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె మండలంలో..

వేంపల్లె : మండలంలోని టి.వెలమవారిపల్లె, కత్తులూరు గ్రామాల్లో 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఈసీ దినేష్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డిల సమక్షంలో పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ రహీం, గూడూరు గుర్రప్ప, గండ్లూరు బాబు, వల్లూరు కమాల్, పుల్లయ్య, వల్లెపు రవీంద్ర, హరీష్, తెల్లదార్ల మల్లికార్జున, చిట్టిబోయిన గంగన్న, రాజు, వెలమకూరు వెంకటరమణ, శంకర్, రమేష్, గంగయ్య, నాగమల్లయ్య, సుబ్బరాయుడులతో పాటు 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రి పాల్గొన్నారు.

ముద్దనూరు మండలంలో..

ముద్దనూరు : మండలంలోని వేల్పుచెర్ల గ్రామంలో శనివారం సాయంత్రం 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డిల సమక్షంలో వేల్పుచెర్ల గ్రామానికి చెందిన శివనాగిరెడ్డి, రమణారెడ్డి, శివానందరెడ్డి, శివలింగారెడ్డి, వెంకట శివారెడ్డి.నాగేశ్వరరెడ్డి తదితరులు పార్టీలో చేరారు.

ఆది వర్గం నుంచి 30 కుటుంబాలు..

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి వర్గానికి చెందిన 30 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం మైలవరం మండలం బెస్తవేములకుచెందిన నారుబోయిన గంగన్న, కిట్టయ్య, గురువయ్యతో పాటు మరో 27 కుటుంబాలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. సర్పంచ్ నారాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె మండలంలో..

చింతకొమ్మదిన్నె : మాజీ మండల ఉపాధ్యక్షుడు చిట్టిబోయిన సుబ్బరాయుడు అలియాస్ జబ్బార్ టీడీపీనుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి సమక్షంలో శనివారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, కో కన్వీనర్ కళయాదవ్ పాల్గొన్నారు.



సింహాద్రిపురం : పార్టీలో చేరిన వారితో సతీష్‌కుమార్‌రెడ్డి తదితరులు



వేంపల్లె: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈసీ దినేష్‌రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : నామినేషన్ పత్రాల పరిశీలనలో 97 మందికి చెందిన 134 నామినేషన్లను పలు కారణాల వల్ల తిరస్కరించగా 155 మందికి చెందిన 230 నామినేషన్లు సరైనవిగా ధ్రువీకరించామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దాఖలు చేసిన సంబంధిత నామినేషన్ పత్రాలను శుక్రవారం ఆయా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల సమక్షంలో పరిశీలించామన్నారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు కడప పార్లమెంటుతోపాటు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి జిల్లా వ్యాప్తంగా మొత్తం 251 మంది అభ్యర్థులు, 364 నామినేషన్లను దాఖలు చేశారన్నారు. పరిశీలన అనంతరం మొత్తం 79 మంది అభ్యర్థులకు సంబంధించిన 134 నామినేషన్లు పలు కారణాల వల్ల తిరస్కరించగా 155 మంది అభ్యర్థులకు చెందిన 230 నామినేషన్ పత్రాలను సరైనవిగా ఆమోదించామన్నారు. కడప పార్లమెంట్‌కు సంబంధించి 14 మందికి చెందిన 27 నామినేషన్లు, బద్వేలు (ఎస్సీ)నియోజకవర్గానికి సంబంధించి 18 మంది అభ్యర్థుల 24, కడప నియోజకవర్గానికి సంబంధించి14 మందికి చెందిన 27, పులివెందుల నియోజకవర్గంలో 30 మందికి చెందిన 43, కమలాపురం నియోజకవర్గానికి సంబంధించి 11 మందికి చెందిన 11, జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబంధించి 24 మంది అభ్యర్థులకు చెందిన 34, ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి 21 మందికి చెందిన 30, మైదుకూరు నియోజకవర్గానికి సంబంధించి 23 మందికి చెందిన 34 నామినేషన్లను ఆమోదించామని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు

కేజీ పీజీసెట్ విజయవంతం

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీస్ కళాశాల వారి ఆధ్వర్యంలో డిగ్రీ ఉత్తీర్ణులై పోస్టు గ్రాడ్యుయేట్ చేయాలనే ఆశావహులకు శనివారం నిర్వహించిన కేజీ పీజీసెట్ 2కె24 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి తెలిపారు.ఈ పరీక్షలో టాప్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఉచిత్ అడ్మిషన్ కల్పిస్తామన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నాగరాజు, కేజీపీజీ సెట్ 2కె24 కన్వీనర్ నరేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష



కడపలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నోడల్ ఆఫీసర్, జిల్లా అబ్జర్వర్, పాలిసెట్ కో ఆర్డినేటర్

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులంతా నిర్ణీత సమయంలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఈ పాలిసెట్ ప్రవేశ పరీక్షకు 7857 మంది విద్యార్థులకు గాను 7090 మంది హాజరుకాగా 767 మంది గైర్హాజరయ్యారు. దీంతో 90.09 శాతం మేర హాజరు నమోదైంది. ఇందులో కడపలోని 09 పరీక్షా కేంద్రాల్లో 3461 మంది విద్యార్థులకు గాను 3037 మంది హాజరుకాగా 424 మంది గైర్హాజరయ్యారు. దీంతో 87.58 శాతం మేర హాజరు నమోదైంది. అలాగే ప్రొద్దుటూరులోని 07 పరీక్షా కేంద్రాల్లో 4396 మంది విద్యార్థులకుగాను 4053 మంది హాజరు కాగా 343 మంది గైర్హాజరయ్యారు. దీంతో 92.6 శాతం మేర హాజరు నమోదైంది. పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన డీఎల్‌డీఏ నోడల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, జిల్లా అబ్జర్వర్ చిన్నపురెడ్డి, కడప సెంటర్ అబ్జర్వర్ చంద్రశేఖర్‌రెడ్డి, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, జిల్లా అసిస్టెంట్ కో ఆర్డినేటర్ దామోదరం కడపలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం
– కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్ : జిల్లాలోని సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతపల్లి క్రాస్ వద్ద చెక్‌పోస్ట్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుల్ కె. శివప్రసాద్ (పి.సి. 2825)ను సస్పెండ్ చేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ క్రమశిక్షణ ఉల్లంఘించి మద్యం తాగి విధులకు హాజరైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో జిల్లా ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో కడప– రాయచోటి రహదారిలో ఊటుకూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రాయచోటి వైపు నుంచి కడప వస్తున్న ఓ టిప్పర్‌ను రోడ్డులో ఎలాంటి జాగ్రత్తలను తీసుకోకుండా నిలిపివేశాడు. కడప నగరం అక్కాయపల్లెకు చెందిన శివనాగరాజు(23), అశోక్‌కుమార్ రాజు (24) స్కూటీపై ఊటుకూరు వైపు నుంచి వచ్చి అదుపుతప్పి టిప్పర్ కిందకు వెళ్లిపోయారు. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే స్థానికులు రిమ్స్‌కు తరలించారు. తరువాత మెరుగైన చికిత్సకోసం కడప నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై ఏఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.


మామిడి, కొబ్బరి చెట్లు దగ్ధం



కాలిపోయిన మామిడి చెట్లు

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామ పొలాల్లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మామిడి, కొబ్బరి చెట్లు దగ్ధమయ్యాయి. మాచిరెడ్డిపల్లెకు చెందిన తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డి పెద్దపుత్త గ్రామ పొలాల్లో ఏడున్నర ఎకరాల్లో మామిడి, కొబ్బరి తోట సాగు చేశాడు. తోట మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్లు శుక్రవారం తెగి కింద పడ్డాయి. దీంతో మంటలు రేగి తోటంతా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో 150 కొబ్బరి, 120 మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. తోటలో ఏర్పాటు చేసిన సాగు నీటి పైపులు కాలిపోయాయి. దీంతో సుమారు 3 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ తనకు నష్ట పరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

మోదీ ప్రభుత్వంలో దళిత క్రిస్టియన్‌లపై దాడులు



మాట్లాడుతున్న ఈశ్వరయ్య, విజయభాస్కర్

ప్రొద్దుటూరు కల్చరల్ : మోదీ ప్రభుత్వంలో ఆదివాసీలు, గిరిజనులు, దళిత క్రిస్టియన్‌లపై దాడులు పెరిగాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో క్రైస్తవులకు రక్షణ కొరవడిందని, మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మోదీ నియంతృత్వ విధానం వల్ల పరమత స్వేచ్ఛకు విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండిపెండెంట్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ మత ప్రచారం పేరుతో పాస్టర్‌లపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న వైఎస్ షర్మిలకు ఇండిపెండెంట్ పాస్టర్ అసోసియేషన్ మద్దతు ఇస్తోందన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు బిషప్ సంతోష్‌కుమార్, ప్రభుదాస్, లాజర్, కిషోర్, డేవిడ్, ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం

వైఎస్సార్ సోదరుల ప్రచారం



పెద్దముడియం మండలం జె.కొట్టాలపల్లె గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సోదరులు వైఎస్ రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్ సుధీకర్ రెడ్డి

పెద్దముడియం : సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని వైఎస్సార్ సోదరులు వైఎస్ సుధీకర్ రెడ్డి,వైఎస్ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. శనివారం వారు మండలంలోని జె.కొట్టాలపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా సుధీర్ రెడ్డిని,ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గిరిధర్ రెడ్డి,భరత్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బూత్ కమిటీ కన్వీనర్లు స్టార్ క్యాంపెయినర్లుగా పనిచేయాలి

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ కన్వీనర్లు స్టార్ క్యాంపెయినర్లుగా పనిచేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక అపూర్వ కల్యాణ మండపంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి నిర్వహించిన బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. 2024 ఎన్నికలకు సంబంధించిన మ్యానిఫెస్టోను కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. బూత్ కమిటీ కన్వీనర్లు ప్రతిరోజు 50 ఇళ్లను తిరిగి ప్రతి కుటుంబంతో పది నిమిషాలు గడిపి ఎన్నికల మ్యానిఫెస్టోను వివరించాలన్నారు. చంద్రబాబు ఇస్తున్న వాగ్దానాలకు అంతే లేకుండా పోయిందని, మహిళలకు కేజీ బంగారం, బెంజ్ కారు ఇస్తానన్న ఆశ్చర్యపోవాల్సిన పని లేదన్నారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ఒక్క జగనన్న వల్లే సాధ్యమైందన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ జగనన్న కోసం మేమంతా సిద్ధం పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని బూత్ కమిటీ కన్వీనర్లు విజయవంతం చేయాలన్నారు. పార్టీ బలోపేతం బూత్ కమిటీ సభ్యులపైనే ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అహ్మద్‌బాషా, ఎన్.సుబ్బారెడ్డి, జమాల్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి సొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండాలి

రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ

కడప కల్చరల్ : దేవునిసొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండేలా సంబంధిత అధికారులంతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. రాయలసీమ జోన్ దేవదాయశాఖ ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగుల విస్తృతస్థాయి సమావేశం శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు తమ పరిధిలోని 6ఏ–బి తదితర దేవాలయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఆలయాల ఆస్తులు, వాటి రిజిస్ట్రేషన్ వివరాలు, పబ్లికేషన్, దేవునికి సంబంధించిన నగలు, ఇతర ఆస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విషయాల గురించి సంబంధిత ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ కమిషనర్ల వద్ద సమా చారం ఉండేలా చూసుకోవాలన్నారు. జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ పై అధికారులకు చేర్చాలన్నారు. అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ పలు ఆలయాలకు సంబంధించిన స్థిర చరాస్తుల,గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు సంవత్సరాలకు సంబంధించి డేటాను సేకరించారు. డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.